# నేడు ఆర్మూర్‌కు గులాబీ సారథి

- పట్టణంలో ప్రజా ఆశీర్వాద సభ
- లక్ష మందికి సరిపడేలా ఏర్పాట్లు
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు
- సభా స్థలిని పరిశీలించిన జీవన్‌రెడ్డి, నాయకులు



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు

ఆర్మూర్, నవంబర్ 2 : ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఆర్మూర్‌కు రానున్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో 63వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఓ ప్రైవేట్ వెంచర్‌లో సుమారు లక్ష మంది ప్రజల కూర్చుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2గంటలకు కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో సభా ప్రాంగణానికి చేరుకొని ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సభకు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. లక్ష మంది జనం స్వచ్ఛందంగా తరలిరానున్న నేపథ్యంలో వేదిక, వీఐపీలు, మీడియా, మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సభా ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యేతో పాటు జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్ పరిశీలించారు.

**భారీగా తరలిరానున్న జనం..**

ఆర్మూర్‌లో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచార సభకు ఆర్మూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు ఆర్మూర్ పట్టణంలో నుంచి ప్రజలు తరలిరానున్నారు. సుమారు లక్ష మంది వరకు సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గూండ్ల చెరువు ప్రాంతంలో పట్టణం నుంచి వచ్చే వారికి, మాక్లూర్ నుంచి వచ్చే వారికి నిజామాబాద్ రోడ్డులో, ఆలూర్ వైపు నుంచి వచ్చేవారి కోసం హన్మాన్ ఆలయ ప్రాంతంలో, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల నుంచి వచ్చే ప్రజల కోసం ఆలూర్ బైపాస్ రోడ్డులో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

**ఆహ్వాన పత్రికల అందజేత...**

కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను సైతం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆయన సతీమణి స్వయంగా కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, వ్యాపారస్తులను కలుస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. మరోవైపు నియోజకవర్గంలోని నందిపేట్, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్, ఆలూర్‌తో పాటు పట్టణంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వారం రోజులుగా ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానిస్తున్నారు.

## సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ కవిత

ఆర్మూర్, నవంబర్ 2 : ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌లో శుక్రవారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరవుతుండడంతో ఏర్పాట్లను ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట కవిత గురువారం రాత్రి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభా స్థలి, ప్రాంగణంలో గ్యాలరీలను పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితా పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్నా, కౌన్సిలర్లు గంగామోహన్ చక్రు, సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, మోత్కూరి లింగాగౌడ్, పండిత్ ప్రేమ్, గంగాధర్, అంజాగౌడ్, చందు, రవిగౌడ్ ఉన్నారు.

# కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ

- కేసీఆర్ దెబ్బకు బీజేపీ మైండ్ బ్లాక్
- ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపే..
- 60వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తా
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, నవంబర్ 2 : రాష్ట్రంలోని ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 5వేల కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గ ప్రజలు తనవైపే ఉన్నారని, 60వేల మోజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. గ్రామాల్లో ఎవరిని కదిలించినా తాము సీఎం కేసీఆర్ పాలనలో ఎంతో బాగుపడ్డామని, తామంతా కేసీఆర్ వెంటేనని ..సభకు భారీగా తరలివస్తామని ప్రజల చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని.. అవినీతి తిమింగలమన్నారు. రాహుల్ గాంధీతో సహా పలువురు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను జీవన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్.. బడా ఫ్యామిలీలకు రెండు మూడు టికెట్లను ఇస్తూ బడుగు వర్గాలకు మొండి చెయ్యి చూపిస్తున్నదన్నారు. నాటి ఆంగ్లేయులది, నేటి కాంగీయులది వంకరబుద్ధి అని.. కాంగ్రెస్ ఈస్టిండియా కంపెనీ అయితే బీజేపీ నార్తిండియా కంపెనీ ఇవి రెండు దేశాన్ని దోపిడీ కంపెనీలే అని ఆరోపించారు. కాంగ్రెస్ బలం కర్ణాటక నోట్లు అని, బీఆర్‌ఎస్ బలం తెలంగాణ ఓట్లు అని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ది అవినీతి మోడల్ అని జీవన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ ఉద్యమ ఫ్యామిలీపై ఎందుకంత అక్కసు అని నిలదీశారు. కేసీఆర్ దెబ్బకు గ్రౌండ్‌లోకి దిగకుండానే బీజేపీకి మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు మాట్లాడుతూ.. దుబ్బాక అభ్యర్థి ప్రభాకర్‌పై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఫ్యామిలీ అండ్ హెల్త్ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితా పవన్, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, సంజయ్‌సింగ్‌బబ్లూ, మోత్కూరి లింగాగౌడ్, గంగాధర్, కొంగి సదాశివ్, మీరా శ్రావణ్, షాహిద్, సుంకరి రవి, ధర్మపురి, నవీన్, జనార్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో ప్రగతి పరుగులు

- వందలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు
- ఇంటింటికీ నీళ్లు, ఊరూరా రోడ్లు
- మెరుగుపడిన మౌలిక వసతులు
- అత్యద్భుతంగా సిద్దుల గుట్ట
- కొత్త మండలాలు ఏర్పాటు.. చేరువైన పాలన..
- తొమ్మిదేండ్లలో ఎనలేని పురోగతి



సుందరంగా మారిన ఆర్మూర్ సిద్దుల గుట్ట

నాడు



నేడు



ఉమ్మెడ వద్ద గోదావరి నదిపై నిర్మించిన వంతెన

నందిపేట్, నవంబర్ 2 : ఆర్మూర్ నియోజికవర్గం అభివృద్ధికి కేరాఫ్ ఆఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నది. తొమ్మిదేండ్ల కాలంలో వందలాది కోట్ల నిధులతో అపూర్వమైన ప్రగతి సాధించింది. రోడ్లు, మురికి కాలువలు, వంతెనలు, దవాఖానలు, పాఠశాలలు, కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్, కొత్త మండలాలు, కొత్త పంచాయతీల ఏర్పాటు, ఎత్తిపోతల పథకాల ఆధునీకరణ, ఆర్మూర్‌లోని సిద్దుల గుట్టకు ఘాట్ రోడ్డుతో పాటు గుట్టపై అభివృద్ధి పనులు, నిర్మాణాలు, ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు, ఆయా గ్రామాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణం, ప్రత్యేక నిధులతో ఆర్మూర్, నందిపేట్ పట్టణాల సుందరీకరణ ఇలా ఎన్నో ప్రగతి పనులతో ఆర్మూర్ నియోజకవర్గం అగ్రస్థానంలో నిలుస్తున్నది.

**రూ. 120 కోట్లతో గోదావరిపై వంతెన**

నిజామాబాద్, నిర్మల్ జిల్లాలను కలుపుతూ నందిపేట్ మండలం ఉమ్మెడ పాత గ్రామం వద్ద గోదావరి నదిపై నిర్మించిన వంతెన రెండు ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా మారింది. సుమారు రూ. 120 కోట్లతో నదిపై వంతెన నిర్మించడంతో 50 కిలో మీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దూరం 10 కిలోమీటర్లకు తగ్గింది. గతంలో రెండు ప్రాంతాల ప్రజలు పుట్టి (నాటు పడవ) ద్వారా ప్రమాదకర పరిస్థితుల్లో నది దాటుతుండేవారు. ఇప్పుడు వంతెన నిర్మాణంతో ఎంతో సౌకర్యవంతమైంది.

**చేరువైన పాలన...**

ఆర్మూర్‌తో పాటు బాల్కొండ నియోజకవర్గాల ప్రజల దశాబ్దాల కల అయిన రెవెన్యూ డివిజన్ ఆర్మూర్‌లో ఏర్పడింది. అలాగే డొంకేశ్వర్, ఆలూర్ మండలాల ఏర్పాటుతో కొత్త కార్యాలయాలు ఏర్పాటై పరిపాలన సౌలభ్యంగా మారింది.

**కల్యాణ మండపాలకు కేరాఫ్ అడ్రస్**

నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో మండపాల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.10 కోట్లకు పైగా వ్యయంతో మండపాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

**సమస్యలు తీర్చిన బైపాస్ రోడ్లు...**

గ్రామాల్లోని ఇరుకు రోడ్లతో తరుచూ పడుతున్న ఇబ్బందులను గమనించి ప్రభుత్వం బైపాస్ రోడ్లను మంజూరు చేసింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయాయి.

**అగ్రగామిగా ఆర్మూర్ సర్కారు దవాఖాన**

పేదవారికి ప్రసవం అనగానే ప్రైవేటు దవాఖాన కాకుండా ఆర్మూర్ ప్రభుత్వ దవాఖాన గుర్తుకు వచ్చేలా సేవలందుతున్నాయి. 30 పడకల స్థాయి నుంచి 100 పడకల స్థాయికి పెంచారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయించి ప్రారంభించారు. ఆర్మూర్, నిజామాబాద్ ప్రధాన రోడ్డును ఆనుకొని మాక్లూర్ మండలం పరిధిలోని చిన్నాపూర్ సమీపంలో రూ. 50 కోట్ల వ్యయంతో అర్బన్ పార్కును తీర్చిదిద్దారు.

**రూ. 250 కోట్లతో రోడ్లు...**

నియోజకవర్గంలో సుమారు రూ. 250 కోట్లతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లను నిర్మించారు. మారుమూలలో ఉన్న ప్రతి పల్లెకు తారు రోడ్డు సౌకర్యం ఏర్పాటయ్యింది. మండలాల నుంచి జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి తళుక్కుమనే డబుల్ రోడ్లు వందలాది కిలోమీటర్ల పొడవునా నిర్మాణాలు జరిగాయి.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I ,MAANPURI SHARADA , H.No : 4-78/14,Venkateshwara Colony ,Mamidipally,Armoor ,Nzb(D). Changed My Surname /Name As MANPURI SHARADA
NTZ-318651

**CHANGE OF NAME**

★ I, MAANPURI BHOOMESHWAR , H.No : 4-78/14,Venkateshwara Colony ,Mamidipally,Armoor ,Nzb(D). Changed My Surname /Name As MANPURI BHUMESHWAR
NTZ-318651

**BUSINESS OFFER**

★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324-All

**CHANGE OF NAME**

★ I ,KOLI GANGADHAR, H.No : 2-15 MAILARAM ,DHARPALLY , Nzb (D). Changed My Surname / Name As KOLI RAMARAO
NTZ-318651

**పాస్‌పోర్ట్ పోయినది**

★ నేను CHAKALI MAHIPAL S/o. CHAKALI MALLAIAH R/o. H.No.3-38/3, Kupriyal (V) Sadashiva Nagar (M), Kamareddy (Dist.) నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. P7809006 గలది. తేది:16-03-2023 కుప్రియల్ నుండి సదాశివనగర్‌కు బస్‌లో వెళ్ళుచుండగా పోయినది. దయచేసి ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు 77802 72484 సంప్రదించగలరు.
NTZ-318521

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.